మనం
కడప | అన్నమయ్య

## 480కోట్లతో చేపడుతున్న పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



వివరాలు 4లో











# రాజంపేట సర్వతోముఖాభివృద్ధే కూటమి ధ్యేయం

-వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతోనే పట్టణానికి శాపం:
-రూ.87 కోట్ల మహా ప్రణాళికతో మున్సిపాలిటీ పునర్నిర్మాణం
-తొలుత రూ.12 కోట్లతో అత్యవసర మరమ్మతులు..
-త్వరలో రూ.75 కోట్లతో సమగ్ర రూపురేఖలు
-వైసీపీ ఐదేళ్ల విధ్వంసానికి చరమగీతం:
-తెదేపా ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్ రాజు స్పష్టీకరణ



మనం ప్రతినిధి రాజంపేట సెప్టెంబర్ 22 మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహనరెడ్డి ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు అభివృద్ధి జాడలేక, నిధుల కొరతతో కొట్టిమిటాడిన రాజంపేట పురపాలక సంఘానికి మహర్దశ పట్టబోతోంది. ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనే పరమావధిగా సాగుతున్న కూటమి ప్రభుత్వం, రాజంపేట రూపురేఖలను సమూలంగా మార్చేందుకు బృహత్తర ప్రణాళికను సిద్ధం చేసింది. స్థానిక నవీన్‌చంద్ర కల్యాణ మండపంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన వర్చువల్ సమావేశాన్ని పురస్కరించుకుని మంగళవారం నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. తెదేపా ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సభకు పార్టీ నాయకులు, శ్రేణులు, పట్టణ ప్రముఖులు భారీగా తరలివచ్చారు. గత పాలకుల అలసత్వాన్ని ఎండగడుతూ, భవిష్యత్ అభివృద్ధి చిత్రపటాన్ని చమర్తి ఈ సందర్భంగా ఆవిష్కరించారు."

**ఐదేళ్ల వైకాపా పాలన.. రాజంపేటకు శాపం**

గత ప్రభుత్వ హయాంలో రాజంపేట పట్టణం తీవ్ర వివక్షకు, నిరాదరణకు గురైందని చమర్తి జగన్మోహన్ రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన గత పాలకులు, పురపాలక సంఘానికి ఒక్క నయాపైసా ప్రత్యేక గ్రాంటు కూడా కేటాయించలేదని ధ్వజమెత్తారు. ప్రధాన రహదారులు గుంతలమయమై, మురుగు కాల్వలు పూడుకుపోయి, వీధిదీపాల నిర్వహణ కూడా లేక పట్టణ ప్రజలు నరకయాతన అనుభవించారని గుర్తుచేశారు. అభివృద్ధి పనుల పేరిట గత నాయకులు ప్రజలను మభ్యపెట్టారే తప్ప క్షేత్రస్థాయిలో చేసిందేమీ లేదని విమర్శించారు.

**తక్షణ ఉపశమనం: రూ.12 కోట్లతో అత్యవసర పనులు**

ప్రజలు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను తక్షణమే అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇచ్చిందని చమర్తి తెలిపారు.
?రూ.12 కోట్ల తక్షణ నిధులతో మున్సిపాలిటీ పరిధిలోని అత్యంత ప్రధానమైన పనులకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నారు.
వర్షాకాలంలో ఇబ్బందులు కలగకుండా పూడికతీత పనులు, పాడైన రహదారులకు తక్షణ ప్యాచ్‌వర్క్‌లు చేపట్టడం.
శివారు కాలనీల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, పారిశుద్ధ్యాన్ని యుద్ధప్రాతి పదికన చక్కదిద్దడమే ఈ నిధుల ముఖ్య ఉద్దేశమని వివరించారు.
?భవిష్యత్ కార్యాచరణ: రూ.75 కోట్లతో స్మార్ట్ పట్టణంగా తీర్చిదిద్దే ప్రణాళిక
?కేవలం తాత్కాలిక మరమ్మతులకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా రాజంపేటను జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రూ.75 కోట్ల సమగ్ర ప్రణాళికను రూపొందించినట్లు చమర్తి వెల్లడించారు.
ఆధునిక రహదారులు - జంక్షన్ల అభివృద్ధి: ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా పట్టణ ప్రధాన రహదారుల విస్తరణ, డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్‌తో పాటు ప్రధాన కూడళ్ల సుందరీకరణ.
పటిష్ఠ భూగర్భ మురుగునీటి వ్యవస్థ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ): వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా శాస్త్రీయ పద్ధతిలో సమగ్ర డ్రైనేజీ నెట్‌వర్క్ రూపకల్పన.
ఆహ్లాదకర వాతావరణం - పార్కుల పునరుద్ధరణ: చిన్నారులు, వృద్ధుల వినోదం, ఆహ్లాదం కోసం పురపాలక పార్కులను అధునాతన హంగులతో అభివృద్ధి చేయడం.
పట్టణ సుందరీకరణ: పచ్చదనం పెంపొందించేలా రోడ్ల ఇరువైపులా మొక్కల పెంపకం, ఆధునిక వీధిదీపాల వ్యవస్థ ఏర్పాటు.
?ప్రగతికి గీటురాయిగా రాజంపేట
?రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాజంపేటను రాష్ట్రంలోనే అభివృద్ధిలో గీటురాయిగా నిలపడమే తమ లక్ష్యమని చమర్తి జగన్మోహన్ రాజు స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తామని, అభివృద్ధి ప్రయోజనాలు ప్రతి గడపకూ చేరేలా కూటమి శ్రేణులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నేతలు, వార్డు ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు, పురప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# పేదల పాలిట వరం ముఖ్యమంత్రి సహాయనిధి

**అనారోగ్య బాధితులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం: యల్లటూరు శ్రీనివాసరాజు**

రాజంపేట మనంన్యూస్ సెప్టెంబర్ 22 అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్య చికిత్సలు పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) ఎంతో అండగా నిలుస్తోందని లిరాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు అన్నారు.మంగళవారం రాజంపేట పట్టణంలోని యల్లటూరు భవన్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లినందలూరు మండలం పొత్తపి గ్రామానికి చెందిన ఆకుల నరసయ్య కుమారుడు శివమణికి 2,21,075/- రూపాయల చెక్కును అందజేశారు.
ఈ సందర్భంగా యల్లటూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థికంగా ఎంతో ఉపశమనాన్ని కల్పిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ప్రజల సంక్షేమం, పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అత్యవసర వైద్య చికిత్సలు అవసరమైన కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, కోలాటం హరి, చలపతి, కుమార్, కొండేటి రవి, కృష్ణదీప్, శివశంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 28న రైల్వే కోడూరులో భారీ ఉద్యోగ మేళా

**పోస్టర్ ఆవిష్కరించిన ముక్కా వరలక్ష్మి**



రైల్వే కోడూరు, సెప్టెంబర్ 22, మనం న్యూస్ స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే బృహత్తర లక్ష్యంతో ఈనెల 28న రైల్వే కోడూరులో భారీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం మరియు సీడాప్ సంయుక్త నిర్వహణలో ఈ ఉపాధి మేళా జరగనుంది.
ఈ ఉద్యోగ మేళాను రైల్వే కోడూరు నియోజకవర్గ శాసనసభ్యులు అరవ శ్రీధర్ , కూటమి నాయకులు, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి ప్రత్యక్ష ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను శ్రీమతి ముక్కా వరలక్ష్మి ఘనంగా ఆవిష్కరించి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా శ్రీమతి ముక్కా వరలక్ష్మి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకే ఈ ఉపాధి మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాంతీయ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ విద్యా అర్హతలకు తగిన ఉద్యోగాల్లో స్థిరపడి కుటుంబాలకు ఆసరాగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు.

**ఉద్యోగ మేళా వివరాలు:**
తేదీ: 28 సెప్టెంబర్ 2026 (సోమవారం)
సమయం: ఉదయం 08:30 గంటల నుండి
వేదిక: శ్రీ సాయి డిగ్రీ మరియు పీజీ కళాశాల, సాయి నగర్, రైల్వే కోడూరు, తిరుపతి జిల్లా -- 516101
అర్హతలు ఒ వయోపరిమితి:
కావాల్సిన అర్హతలు: 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ (అన్ని ట్రేడ్‌లు), డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బి.టెక్, పీజీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ మేళాకు హాజరుకావచ్చు. వయోపరిమితి: 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు అర్హులు.

**ఆన్‌లైన్ నమోదు ఒ సంప్రదింపులు:**
ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈనెల 28-09-2026 నాటికి క్రింది అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.
అధికారిక వెబ్‌సైట్:https://naipunyam.ap.gov.in/
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9052717078, 9550095775
అర్హత కలిగిన యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరై ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తిరుపతి జిల్లా బృందం కోరింది.

# గణపతి ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి






ప్రొద్దుటూరు సెప్టెంబర్ 22 మనంన్యూస్: ప్రొద్దుటూరు శివాలయం శ్రీ గణపతి ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో స్థానిక టిటిడి కళ్యాణమండపము నందు 50వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన గణపతి ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కమిటీ వారితో కలసి 50వ వార్షికోత్సవ స్వర్ణోత్సవ సావనీరు పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి. కార్యక్రమంలో శివాలయం ఛైర్మన్ వంగల నారాయణారెడ్డి, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు,మల్లిఖార్జున రావు,వీరారెడ్డి, సుధీర్ నాయుడు అట్ల నరసింహారెడ్డి, కొప్పర్తి శేఖర్, పుల్లయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా ఎక్సైజ్ లైసెన్సులను పునరుద్ధరించుకోవాలి

### జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారులు జయరాజ్, మధుసూదన్



రైల్వే కోడూరు, సెప్టెంబర్ 22, మనం న్యూస్ : మద్యం దుకాణా దారుల కు ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానానికి అనుగుణంగా, నిర్ణీత గడువులోగా తమ లైసెన్సుల పునరుద్ధరణ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ కమిషనర్ జయరాజ్, జిల్లా సూపరింటెండెంట్ మధుసూదన్ స్పష్టం చేశారు. కోడూరు పరిధిలోని లైసెన్సుదారులతో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అధికారులు పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన నూతన ఎక్సైజ్ పాలసీ నియమ నిబంధనలను, లైసెన్స్ పునరుద్ధరణ విధానాన్ని వ్యాపారులకు సమగ్రంగా వివరించారు. ఈ నెల 23 వ తేదీ లోపల లైసెన్సుల పునరుద్ధరణ రుసుము చెల్లించి పునరుద్ధరణ చేసుకోవాలని అధికారులు తెలిపారు. సమయం తక్కువగా ఉన్నందున లైసెన్సుదారులు ఎలాంటి ఆలస్యం చేయకుండా, అవసరమైన అన్ని పత్రాలు మరియు రుసుములతో కూడిన దరఖాస్తులను తక్షణమే సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక ఎక్సైజ్ సిఐ టి కె తులసి, ఎస్ఐలు సిబ్బందితో పాటు కోడూరు ప్రాంత లైసెన్సుదారులు పాల్గొన్నారు.

## చౌక దుకాణాల కాటాల తనిఖీ... లీగల్ మెట్రాలజీ సిఐ




ముద్దనూరు, సెప్టెంబర్, 22,మనం న్యూస్: మండల తహసీల్దార్ కార్యాలయ భవనంలో మంగళవారం చౌక దుకాణాల డీలర్ల కాటాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ శాఖ సీఐ పరమేశ్వర్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ కరిముల్లా ఆధ్వర్యంలో చౌక దుకాణాల డీలర్లకు సంబంధించిన కాటాలను పరిశీలించారు.
కాటాల పనితీరు, వాటి స్థితిగతులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి, పరిశీలనకు సంబంధించిన ధ్రువపత్రాలను చౌక దుకాణ డీలర్లకు అందజేశారు. అనంతరం మండలంలోని చౌక దుకాణాల డీలర్లందరికీ క్యూఆర్ కోడ్ ద్వారా మిషన్లలో అవసరమైన సమాచారాన్ని ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, వాటిని ఎలా వినియోగించాలి అనే అంశాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చౌక దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరులో ఘనంగా వరసిద్ధి వినాయక నిమజ్జనం

### పోటీపడి లడ్డూ, వెండి బిళ్ల వేలం పాడుకున్న భక్తులు



ప్రొద్దుటూరు (22) మనం న్యూస్ : స్థానిక మున్సిపల్ ఆఫీస్ సమీపంలోని శ్రీరామ అపార్ట్‌మెంట్ వద్ద 7వ వార్షికోత్సవ వరసిద్ధి వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బొజ్జ గణపయ్య విగ్రహాన్ని ట్రాక్టర్‌లో అలంకరించి చెక్కభజనలు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లు మరియు రంగుల హోలీ మధ్య మునిసిపల్ పార్కు పురవీధుల్లో శోభా యాత్రగా ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి ప్రసాదాలు, విగ్రహాల వేలంపాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. వెండి బిళ్ళ దాత పి. సురేంద్ర స్వామివారికి సమర్పించిన వాటిని అత్యధికంగా పాటలో దక్కించుకున్న కె. సురేష్ వెండి బిళ్ళ 70,000రు, పాలెం శ్రీనివాసులు వెండి విగ్రహం 65,000రు, నోట్ల దండ మురళి 40,900రు వినాయకుని లడ్డూషేక్ శామీర్ 30,888రు, ?కలశం చెంబు రాజా 15,000రు, అనంతరం వినాయకుని విగ్రహాన్ని కామునూరు ఏరులో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని కమిటీ ప్రతినిధులు గౌస్, నాగేష్, మురళి, సురేంద్ర తదితరులు కోరుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తాటి విత్తనాలు నాటిన అటవీ శాఖ అధికారులు



సిద్ధవటం సెప్టెంబర్ 22(మనం న్యూస్) కడప జిల్లా డిఎఫ్ఓ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు, సిద్ధవటం ఎఫ్ ఆర్ వో నయీమ్ అలీ సూచనల మేరకు మంగళవారం సిద్ధవటం రేంజ్ నందు రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దుల వెంబడి తాటి విత్తనాలను నాటడం జరిగింది. నయీమ్ అలీ మాట్లాడుతూ తాటి చెట్ల వలన ఆవాసం, ఆహారం, పరాగసంపర్కం, నేల సంరక్షణ మరియు పర్యావరణ సమతుల్యత ద్వారా జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం రేంజ్ అటవీ సిబ్బంది మరియు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నాం

### జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి - వెలిదండ్ల గ్రామంలో అవకాడో పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్





కడప, సెప్టెంబర్ 22 మనం న్యూస్ : పులివెందుల నియోజక వర్గం, లింగాల మండలం, వెలిదండ్ల గ్రామంలో రైతు కర్నా వరదారెడ్డి సాగు చేస్తున్న అవకాడో పంటను మంగళవారం జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా అవకాడో తోటను సందర్శించిన కలెక్టర్, పంట సాగు విధానం, పెట్టుబడి వ్యయం, దిగుబడి, మార్కెట్ ధరలు, రైతుకు లభిస్తున్న ఆదాయం తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. అవకాడో వంటి అధిక పోషక విలువ కలిగిన ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను సూచించారు. పంట ఎంపిక నుంచి సాగు, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ, కోత అనంతర నిర్వహణ, మార్కెటింగ్ వరకు రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలను ఉద్యానశాఖ అధికారులు అందించాలని ఆదేశించారు. అలాగే అవకాడో సాగుకు అనుకూలమైన భూములు, నీటి వనరులు ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆసక్తి ఉన్న రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేసే విధానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో అవకాడో సాగును విస్తరించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన పంటల ప్రోత్సాహకాలు, రాయితీలు మరియు ఇతర పథకాలపై రైతులకు పూర్తి సమాచారం అందించి, అర్హులైన రైతులు వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెలిదండ్ల గ్రామంలో అవకాడో సాగు చేస్తున్న రైతు అనుభవాలను ఇతర రైతులకు కూడా తెలియజేసి, జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపరిచే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పంటకు మార్కెటింగ్ సదుపాయాలు, గిట్టుబాటు ధరలు లభించేలా రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని, పంట ఉత్పత్తిని నాణ్యతా ప్రమాణాలతో మార్కెట్‌కు తీసుకెళ్లే విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుబ్రమన్యేశ్వర రావు, ఉద్యాన శాఖాధికారి హరి ప్రసాద్, డ్వామా పిడి ఆదిశేషారెడ్డి, ఏపిఎంఐపి పిడి రమణ, మాజీ శాసన మండలి సభ్యులు రవీంద్ర నాద్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పాలకొండ్రాయునిపల్లి గణనాథుడి నిమజ్జనం

### వేడుకల్లో పాల్గొన్న టిడిపి నేతలు, నేతలను సత్కరించిన రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుప్పాల





సిద్ధవటం, సెప్టెంబర్22(మనం న్యూస్) పాలకొండ్రాయునిపల్లి లో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనం కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు. 17వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం గణేశుని ప్రతిమ నిమజ్జనం చేశారు. డీజే పాటల నడుమ యువకులు,మహిళలు చిన్నారులు ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులకు భారీగా అన్నసంతర్పన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు బాలిశెట్టి హరిప్రసాద్ హాజరై కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన నాయకులకు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య శాలువతో సత్కరించి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, టిడిపి మండల అధ్యక్షుడు, రాజశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ రాజా నాయుడు, నియోజకవర్గ రైతు విభాగపు కన్వీనర్ మల్లు వెంకట సుబ్బారెడ్డి, పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగ వమునిరెడ్డి,పార్ల శ్రీనివాసులు,గణేష్ ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు హరి ప్రసాద్ మాట్లాడుతూ గత ఐదేళ్లగా పాలకొండ్రాయుని పల్లెలో గణేష్ఉత్సవాల్లో పాల్గొంటున్నా అని, ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో చేసుకోవడం సంతోషకరమని పోలీస్ శాఖ, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ప్రశాంతత వాతావరణంలో వేడుకలు జరుపుతున్నారన్నారు, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వినాయకుని వేడుకలు, గ్రామాలలో ఎటువంటి సమస్యలు లేకుండా ప్రశాంతత వాతావరణంలో గణేష్ వేడుకలు జరుగుతున్నాయని అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామివారి ప్రసాదంగా స్వీకరించాలని తెలిపారు.
రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మండల, గ్రామ ప్రజలు వినాయకుని స్వామి ఆశీర్వాదంతో ప్రతి ఒక్కరికి భగవంతుడు భోగభాగ్యాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు,టిడిపి నేతలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గురువులపై గొడ్డలి పార్టీ గుండాల దాడి అమానుషం

### తీవ్రంగా ఖండించిన రాష్ట్ర చైర్మన్ కెకె చౌదరి



చిట్వేలి సెప్టెంబర్ 22 మనం న్యూస్: విజయవాడ సాప్ కార్యాలయం దగ్గర తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పడానికి, తమ దగ్గర ఉన్న సర్టిఫికెట్లు చూపించడానికి వచ్చిన ఉపాధ్యాయులను గౌరవంగా వారి మాటలను వినాల్సింది పోయి వారితో ఘర్షణకు దిగడం అత్యంత దురదృష్టకరం, అమానుషం అని రాష్ట్ర చైర్మన్ కేకే చౌదరి అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులను రోడ్డుపైకి లాగి అవమానించడం వైసీపీ రాజకీయ సంస్కృతికి నిదర్శనమన్నారు. క్రీడల్లో దేశానికి, రాష్ట్రానికి పేరు తెచ్చిన యువతను వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసం అవమానించకూడదనీ. ఒక ఉపాధ్యాయుడిపై చేయి పడితే అది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదనీ, గురువు అనే వ్యవస్థపై దాడి అని అన్నారు. ఒక ఉద్యోగం వెనుక ఒక యువకుడి సంవత్సరాల కష్టం ఉంటుందనీ. ఒక కుటుంబం ఆశ ఉంటుంది. అలాంటి ఉద్యోగాన్ని రాజకీయంగా అవమానించడం వైసీపీ నాయకుల రౌడీయిజానికి పరాకాష్ట అన్నారు. జగన్ కి, వైసీపీ నాయకులకు ఇప్పుడు ఉద్యోగాలపై ప్రేమ పుట్టిందా? ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగుల సమస్యలు గుర్తుకురాలేదా ఉద్యోగాలు పొందిన టీచర్లను టార్గెట్ చేసి, వారితో ఘర్షణకు దిగడం ఏ రకమైన ప్రజాస్వామ్యం జగన్ నాయకత్వంలో వైసీపీకి అలవాటైన రౌడీల సంస్కృతిని ఉద్యోగాల కోసం కష్టపడ్డ యువతపైకి తీసుకురావద్దనీ జగన్ మెప్పు కోసం ఎవరు ఏం చేస్తున్నారో ప్రజలకు తెలుసని. కానీ నిరుద్యోగ యువత భవిష్యత్తుతో రాజకీయాలు ఆడటం మాత్రం సహించేది లేదన్నారు. గురువులను గౌరవించే సంస్కృతి మనదనీ. గురువులను అవమానించే రాజకీయ సంస్కృతిని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికీ అంగీకరించరనీ. మంత్రి లోకేష్ అసెంబ్లీలోనే చెప్పారనీ ఆధారాలు ఉంటే తీసుకురండి, చర్చకు సిద్ధమని. మరి ఇప్పుడు మళ్లీ అదే ఆరోపణలు, అదే రాజీనామా డిమాండ్ ఎందుకన్నారు. ఆధారాలు ఉంటే విచారణకు రండి అని. ఈ సర్టిఫికెట్స్ అన్నీ కూటమి ప్రభుత్వం వచ్చాక సృష్టించినవి కావు. క్రీడా సంఘాలు, పోటీలు, సర్టిఫికెట్స్ కి వాటి స్వంత రికార్డులు ఉన్నాయి. జగన్ సిబిఐ అంటున్నారు, రాజీనామా అంటున్నారు. కానీ నిన్న అక్కడ ఉద్యోగం సాధించిన టీచర్లు స్వయంగా వచ్చి మా దగ్గర ఒరిజినల్ సర్టిఫికెట్లు ఉన్నాయి, పరిశీలించండి అని చెబితే వాటిని పరిశీలించకుండా అక్కడికి రౌడీ షీటర్ లను తీసుకవచ్చి ఎందుకు రెచ్చగొట్టే విధంగా రాజకీయ నినాదాలు చేసి, గురువులను బూతులు తిడుతూ వారి పైన దాడి చేశారు. వైసీపీ పార్టీ అంటే కోర్టు కాదు, దర్యాప్తు సంస్థ కాదు, సర్టిఫికెట్ ఇష్యూయింగ్ అథారిటీ కాదు. మరి సర్టిఫికెట్ లు ఫేక్ అని తుది తీర్పు చెప్పే అధికారం వారికి ఎవరు ఇచ్చారు. కానీ టీచర్లపై దాడులు చేసి, వారిని అవమానించి, వైసీపీ నాయకులు రాజకీయ రౌడీయిజం చేస్తే మాత్రం కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. ఉద్యోగం సంపాదించిన ప్రతి యువకుడి గౌరవాన్ని కాపాడటం మా బాధ్యత అని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కెకె చౌదరి పేర్కొన్నారు.

## ఎస్సై కి ఘనంగా సత్కరించిన గణేష్ ఉత్సవ కమిటీ

సిద్ధవటం సెప్టెంబర్ 22 మనం న్యూస్
గణనాథుడి నిమజ్జన వేడుకల్లో ఎస్సై హారిక కు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు మండలంలోని, పాలకొండ్రాయినిపల్లె గ్రామంలో మంగళవారం వినాయక 17వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆమెకు ఘనంగా సత్కరించి స్వామి వారి ప్రసాదాలు అందించారు ఈ సందర్భంగా మండల ఎస్సై హారిక మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో గ్రామోత్సవం వేడుకలు జరుపుకోవాలని ప్రతి ఒక్కరికి స్వామి వారి అనుగ్రహం ఉండాలని ఎస్ఐ హారిక తెలిపారు ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు స్థానిక పోలీసులు పాల్గొన్నారు







# 480కోట్లతో చేపడుతున్న పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప , సెప్టెంబర్ 22 మనం న్యూస్ : పులివెందుల ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో రూ.480 కోట్ల అంచనా వ్యయంతో పులివెందుల నియోజక వర్గం, లింగాల మండలం, పార్నపల్లి గ్రామం వద్ద చేపడుతున్న పులివెందుల తాగునీటి సరఫరా పథకం పనులను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మంగళవారం పరిశీలించారు. త్వరలో పులివెందుల తాగునీటి సరఫరా పథకంను ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పథకంలో చేపడుతున్న వివిధ పనులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, పూర్తికి అవసరమైన చర్యలపై అధికారులతో సమీక్షించారు. పథకం ద్వారా పులివెందుల ప్రాంత ప్రజలకు నిరంతరాయంగా, సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్ డబ్ల్యూఎస్. శాఖ ఎస్.ఈ ఏడుకొండలు, డిపిఓ రామచంద్ర, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, మాజీ శాసన మండలిసభ్యులు రవీంద్రనాథ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ప్రాజెక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాయుడు కాలనీలో నీటి సరఫరాకు విద్యుత్ లైన్ ఏర్పాటు





రాయచోటి మనం న్యూస్ సెప్టెంబర్ 22:

పట్టణంలోని రాయుడు కాలనీలో గంగమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన బోరుకు నీటి సరఫరా కోసం అవసరమైన విద్యుత్ లైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు బోరు ఏర్పాటు చేయగా, విద్యుత్ సరఫరా సరిపోక నీటి పంపింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని స్థానికులు టీడీపీ నాయకుడు రంజిత్ రాయల్ ఆధ్వర్యంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన మంత్రి వెంటనే విద్యుత్, మున్సిపల్ అధికారులను అప్రమత్తం చేసి, నీటి సరఫరాకు అవసరమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించినట్లు రంజిత్ రాయల్ తెలిపారు. ఇందులో భాగంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సొంత నిధులతో జేసీబీ సహాయంతో విద్యుత్ పోల్ ఏర్పాటు కోసం అవసరమైన పనులను స్థానికుల సహకారంతో చేపట్టినట్లు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయుడు కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని రంజిత్ రాయల్ తెలిపారు. కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు...

# మీ ఫోన్ స్క్రీన్ గార్డ్ ఇక ఎలా ఉండాలంటే?.. కేంద్రం కొత్త రూల్స్

**స్క్రీన్ ప్రొటెక్టర్లకు బీఐఎస్ ప్రమాణాలు తప్పనిసరి - 2027 ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు అమలు**

**ఐఎస్ 19348:2025 ప్రమాణాలను పాటించాలి - గ్లాస్ నాణ్యత, క్లారిటీపై ప్రత్యేక ప్రమాణాలు**

**ప్యాకేజింగ్‌పై బ్యాచ్ నంబర్, మందం వివరాలు తప్పనిసరి**

స్మార్ట్‌ఫోన్లకు వాడే తక్కువ నాణ్యత స్క్రీన్ ప్రొటెక్టర్ల విక్రయాలపై కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఇకపై భారత్‌లో విక్రయించే స్క్రీన్ ప్రొటెక్టర్లు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ వీటిని 'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్' (బీఐఎస్) తప్పనిసరి రిజిస్ట్రేషన్ పరిధిలోకి తీసుకొచ్చింది. 2027 ఏప్రిల్ 1 నుంచి ఐఎస్ 19348:2025 ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న స్క్రీన్ ప్రొటెక్టర్లనే విక్రయించాల్సి ఉంటుంది.



### ఆరు నెలలకు పైగా గడువు

సెప్టెంబర్ 21న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌లో 'స్క్రీన్ ప్రొటెక్టర్స్ ఫర్ స్మార్ట్‌ఫోన్స్'ను తప్పనిసరి రిజిస్ట్రేషన్ పరిధిలోకి చేర్చింది. తయారీదారులు, దిగుమతిదారులు కొత్త నిబంధనలకు అనుగుణంగా ఉత్పత్తులను సిద్ధం చేసుకునేందుకు 2027 ఏప్రిల్ 1 వరకు గడువు ఇచ్చింది. అంటే ఈ నిబంధనలు వెంటనే అమల్లోకి రావు. ఆ తేదీ నుంచి బీఐఎస్ ప్రమాణాలను పాటించడం తప్పనిసరి అవుతుంది.

### నాణ్యతపై ప్రత్యేక ప్రమాణాలు

కొత్త ఐఎస్ 19348:2025 ప్రమాణంలో గ్లాస్ నాణ్యత, పరిమాణం, గ్లాస్ బలం, ఉపరితల నాణ్యతకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. స్క్రీన్ ప్రొటెక్టర్ ఎంత మేరకు కాంతిని ప్రసారం చేయాలి, కనిపించే లోపాలు ఎలా ఉండాలనే అంశాలనూ ఇందులో పేర్కొన్నారు. అంటుకునే పదార్థం, యాంటీ-షాటర్ ఫిల్మ్, ఆయిల్ నిరోధక కోటింగ్, యాంటీ-గ్లేర్, బ్లూ-లైట్ ఫిల్టరింగ్, ప్రైవసీ ఫిల్మ్‌లకు సంబంధించిన అంశాలూ ప్రమాణాల్లో ఉన్నాయి.

### ప్యాకేజింగ్‌పై వివరాలు తప్పనిసరి

స్క్రీన్ ప్రొటెక్టర్ల ప్యాకేజింగ్‌పై తయారీదారు పేరు, బ్యాచ్ నంబర్, మందం వంటి కీలక వివరాలను అందించాల్సి ఉంటుంది. కొత్త ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులను పరీక్షించిన తర్వాతే విక్రయించాల్సి ఉంటుంది. తయారీదారులు, దిగుమతిదారులు ఈ నాణ్యత నిబంధనలను పాటించాల్సి ఉంటుంది.

### కొనుగోలుదారులకు ఏం మారుతుంది?

కొత్త నిబంధనలతో మార్కెట్‌లో నాణ్యమైన స్క్రీన్ ప్రొటెక్టర్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం వివిధ ధరల్లో బ్రాండెడ్ నుంచి బ్రాండ్ లేని ఉత్పత్తుల వరకు స్క్రీన్ గార్డులు, టెంపర్డ్ గ్లాస్‌లు లభిస్తున్నాయి. ఇకపై తయారీదారులు, దిగుమతిదారులు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది.

ధరలు పెరుగుతాయా?

స్క్రీన్ ప్రొటెక్టర్ల ధరలు పెరుగుతాయని కేంద్రం జారీ చేసిన గెజిట్‌లో ఎలాంటి ప్రకటన లేదు. నిర్దిష్ట ఉత్పత్తులను మార్కెట్ నుంచి తొలగిస్తామని కూడా చెప్పలేదు. అయితే అదనపు పరీక్షలు, ధ్రువీకరణ వంటి నిబంధనల కారణంగా కొంతమంది తయారీదారులు, దిగుమతిదారుల నిర్వహణ విధానాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నిబంధన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చట్టం-2016 కింద జారీ అయింది.



# నాలుగు రోజుల లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

**సెన్సెక్స్ 330 పాయింట్లు, నిఫ్టీ 85 పాయింట్లు నష్టపోయిన వైనం**

**ఐటీ, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో నష్టాలు**

**మీడియా, రియల్టీ, మెటల్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు**

దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ నష్టాలతో ముగిశాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిఫ్టీ లాభాల జోరుకు బ్రేక్ పడింది. ప్రధానంగా ఐటీ, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు నష్టాల్లోకి జారాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 329.91 పాయింట్లు (0.44 శాతం) నష్టపోయి 74,529.08 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 85.30 పాయింట్లు (0.36 శాతం) క్షీణించి 23,329.00 వద్ద ముగిసింది. నాలుగు రోజుల వరుస లాభాల తర్వాత ఇన్వెస్టర్లు హెవీవెయిట్ షేర్లలో లాభాలను స్వీకరించడం మార్కెట్లపై ప్రభావం చూపింది. రంగాలవారీగా చూస్తే.. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయింది. దీనితో పాటు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఫార్మా సూచీలు కూడా నష్టాల్లో ముగిశాయి. మరోవైపు, మీడియా, రియల్ ఎస్టేట్, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఈ రంగాల సూచీలు లాభాల్లో ముగియడంతో మార్కెట్ నష్టాలు కొంతమేర పరిమితమయ్యాయి.

నిఫ్టీలో ట్రెంట్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్రాడర్ మార్కెట్‌లో కూడా బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.08 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం స్వల్పంగా నష్టపోయాయి. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు కొన్ని రంగాల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుని, ఇతర రంగాల్లోకి మళ్లిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# డేటా లేకుండా తక్కువ వ్యాలిడిటీతో ప్రత్యేక వోచర్లు..

**టెలికం సంస్థలకు కొత్త నిబంధనలు జారీ**

**తక్కువవ్యవధి వాయిస్, ఎస్ఎంఎస్‌రీచార్జ్‌లకు ట్రాయ్ అనుమతి**

**ప్రతి నెల ఒకే తేదీన రీచార్జ్ చేసుకునే సదుపాయం**

**ఎక్కువ కాలపరిమితి ఉన్న ఎస్‌టీవీలు కూడా తప్పనిసరి**

తక్కువ ఆదాయం ఉన్న టెలికాం వినియోగదారులకు మరిన్ని రీఛార్జ్ ఆప్షన్లు అందుబాటులోకి రానున్నాయి. కేవలం వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ అవసరాల కోసం తక్కువ కాలపరిమితితో 'ప్రత్యేక టారిఫ్ వోచర్లు' (ఎస్‌టీవీలు) అందించాలని టెలికాం సంస్థలను ట్రాయ్ ఆదేశించింది. ఈ మేరకు 'టెలికాం కన్స్యూమర్ ప్రొటెక్షన్ (13వ సవరణ) రెగ్యులేషన్-2026'ను మంగళవారం విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం 30 రోజుల కాలపరిమితితో పాటు 30 రోజుల కంటే తక్కువ వ్యవధికి కూడా వాయిస్, ఎస్ఎంఎస్ మాత్రమే ఉండే ఎస్‌టీవీలను టెలికాం కంపెనీలు అందించాలి. వినియోగదారులు తమ అవసరానికి తగ్గట్టు, ఆర్థిక స్థితికి అనుగుణంగా రీఛార్జ్ చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని కేంద్ర సమాచార శాఖ తెలిపింది. ప్రతి నెల ఒకే తేదీన రీఛార్జ్ చేసుకునే అవకాశం కూడా ఉండాలి. ఆ తేదీ ఆ నెలలో లేకపోతే చివరి తేదీని పరిగణనలోకి తీసుకోవాలి. వాయిస్, ఎస్ఎంఎస్, డేటాతో కూడిన ఎస్‌టీవీలకు అందించే కాలపరిమితికి సరిపోయేలా కనీసం ఒక ఎక్కువ వ్యాలిడిటీ వోచర్ కూడా అందుబాటులో ఉంచాలి. 2024లో చేసిన 12వ సవరణ తర్వాత వాయిస్, ఎస్ఎంఎస్ మాత్రమే ఉన్న ఎస్‌టీవీలపై ట్రాయ్ సమీక్ష చేపట్టింది. మార్కెట్‌లో ఇలాంటి రీఛార్జ్‌లు తక్కువగా ఉన్నాయని గుర్తించింది. అందులోనూ ఎక్కువ కాలపరిమితి ఉన్న ప్లాన్లే ఎక్కువగా ఉండటంతో తక్కువ వ్యవధి రీఛార్జ్‌లు కోరుకునే వినియోగదారులకు ఆప్షన్లు తగ్గాయని తెలిపింది.వాటాదారుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత తాజా నిబంధనలను ఖరారు చేసినట్లు ట్రాయ్ వెల్లడించింది. డేటా అవసరం లేని వినియోగదారులకు మరిన్ని ఆప్షన్లు అందుబాటులో ఉంచడమే దీని ఉద్దేశమని పేర్కొంది.

# విజయవాడలో ఉపాధ్యాయుల పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

**నోబుల్ టీచర్ అసోసియేషన్**

**రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు**

రాయచోటి మనంన్యూస్: విజయవాడ శాప్ కార్యాలయం ముందు ఉపాధ్యాయులపై కొందరు రాజకీయ వ్యక్తులు చేసిన దాడులను నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నేతాజీ సర్కిల్ రాయచోటి నందు ఏర్పాటుచేసిన సమావేశంలో తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరాజు మాట్లాడుతూ, రాజకీయ ముసుగులో ఉపాధ్యాయులపై చేసిన దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ ముసుగులో వారు ప్రవర్తించిన తీరు ఉపాధ్యాయులపై చేసిన ఆరోపణలు మరియు ఉపాధ్యాయులను నీచాతి నీచంగా సభ్య సమాజం తలదించుకునే విధంగా మాట్లాడిన తీరు చాలా బాధాకరం అన్నారు. గత రెండు నెలలుగా వారు చేసిన ఆరోపణలకు అధికారులు పూర్తి సమాచారాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఇలా ప్రవర్తించడం సబబు కాదన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నల్లమల రామాంజులు గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చట్టంలో కొన్ని మార్పులు చేసి ఉపాధ్యాయులపై దాడి చేసిన వారికి కఠిన శిక్షలు అమలు అయ్యే విధంగా చట్టాలలో మార్పులు తీసుకురావాలన్నారు.ఈ సమావేశంలో పకీర, నాగరాజు, పీరయ్య, రామ నాయుడు, రాజేంద్ర నాయుడు, రెడ్డయ్య రాజు, మధుసూదన రెడ్డి, రమేష్ రాజు, వెంకటరామరాజు, రాచయ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.